
సాక్షి
మంచిర్యాల
బుధవారం, 22, మే, 2024



లైబ్రరీ లేక ఇబ్బందులు 9లో▸
నస్పూర్‌లో లైబ్రరీ, స్టడీ సెంటర్ లేక పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. అన్ని వసతులతో శాశ్వత లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఘనంగా ఎల్లమ్మ బోనాలు
జిల్లాలోని పలు గ్రామాల్లో ఎల్లమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /29.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి గాలులు వీస్తాయి. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాల టౌన్: జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తెరవకపోవడంతో 'సాక్షి'లో మంగళవారం 'అంగన్‌వాడీ కేంద్రాలు బంద్' శీర్షికన ప్రచురించిన కథనానికి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు స్పందించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో, సూపర్‌వైజర్‌లు తనఖీ చేశారు. కేంద్రాలు తెరవని ఆయాలకు మెమోలు జారీ చేసినట్లు మంచిర్యాల సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీ ఇస్లాంపుర–1, మారుతీనగర్, ఒడ్డెర కాలనీ, నేతాజీనగర్, ఎల్‌ఐసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలకు మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఏసీసీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు కూడా బుధవారం మెమో జారీ చేస్తామని తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో శైలజ సూచించారు. మంగళవారం మంచిర్యాల డీఐఈవో కార్యాలయంలో సీఎస్, డీవో, కళాశాలల ప్రిన్సిపాల్, కస్టోడియన్‌లతో పరీక్షలపై నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈనెల 24నుంచి జూన్ 1వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30నుంచి 5.30గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతీ సెంటర్‌లో ఏఎన్ఎంలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణ, విధుల గురించి వివరించారు. సమీక్షా సమావేశంలో సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

మోదీ విజయసంకల్ప యాత్ర ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వికసిత్ భారత్ లక్ష్యంగా–కమల వికాసం కాంక్షతో నరేంద్ర మోదీ విజయసంకల్ప యాత్రను మంగళవారం ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డుకూరి కిరణ్‌కుమార్ సారథ్యంలో మంచిర్యాల నుంచి ప్రారంభించారు. జూన్ నాలుగో తేదీన కేదరీనాథ్ యాత్రతో ముగుస్తుందని మోదీ అభిమానులు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీతో పాటు దేశంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 21పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కిరణ్‌కుమార్‌తో పాటు సిద్ది సురేశ్, వెల్దండి వినోద్, కైలాస నవీన్, ఐనంపూడి వేణు తదితరులున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



దుబ్బపల్లిలో పనులు పరిశీలిస్తున్న రాహుల్

జైపూర్: అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులు ఈ నెల 31లోపు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ సూచించారు. ఇందారం, కుందారం, గంగిపల్లి, దుబ్బపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేలా చూడాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులున్నారు.

రిఫరల్ దందా!



నెన్నెల: మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్

- ఆర్‌ఎంపీ, పీఎంపీల కాసుల కక్కుర్తి
- ప్రైవేట్ దవాఖానాలతో కుమ్మక్కు
- పేషెంట్లను చేర్చుతూ కమీషన్లు
- బిల్లులు చూసి రోగుల బెంబేలు
- దోచుకుంటున్న యాజమాన్యాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అర్హతకు మించి వైద్యం చేయడమే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రులు ఇస్తున్న కమీషన్ల ఆశకు కొందరు ఆర్‌ఎంపీలు రిఫరల్ దందా చేస్తున్నారు. తమ వద్ద చికిత్స చేయించుకున్న పేషెంట్లను రిఫరల్‌గా పంపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లో అనేక ప్రైవేట్ ఆస్పత్రులు వెలిశాయి. ఆస్పత్రుల మధ్య పోటీ పెరిగి రోగులను ఆకర్షించేందుకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు రిఫరల్ కేసులపైనే అధికంగా ఆధారపడుతున్నారు. ఒక్కో ఆస్పత్రిలో పేషెంట్ చెల్లించిన మొత్తం బిల్లులో 20నుంచి 30శాతం కమీషన్ల రూపంలో ఇస్తున్న ఆస్పత్రులున్నాయి. కమీషన్ల కోసం పేరున్న ప్రైవేట్ ఆస్పత్రులకు చికిత్స కోసం రిఫర్ చేస్తున్నారు. కమీషన్లు ప్రత్యేక అవసరమైన చికిత్సలతో పాటు సాధారణ వైద్యంలో, పలు రకాల ఆపరేషన్లు, డెంగీ, చికెన్‌గున్యా, జ్వరం తదితర వాటి కోసం ఇన్‌పేషెంట్‌గా సేవలు పొందుతున్న రోగులు చెల్లించే డబ్బుల్లో పర్సంటేజీలు ఇస్తున్నారు. జిల్లాలో ఒకరిద్దరు ఆస్పత్రుల యాజమాన్యాలు ఆర్‌ఎంపీలకు చేసిన కమీషన్ల అలవాటుతో ప్రతీచోట రిఫరల్‌కు వారికో ఆదాయ వనరుగా మారింది. గతంలో కొందరు ప్రత్యేక బహుమతులు కూడా ఇచ్చినట్లుగా చెబుతున్నారు. ఆర్‌ఎంపీలతో సమావేశాలు, సదస్సులు నిర్వహించి తమ ఆస్పత్రులకే వచ్చేలా చూడాలంటూ కోరుతున్నారు. మొదట కొందరు ఆస్పత్రుల వాళ్లు కమీషన్లు అలవాటు చేయగా వ్యవస్థీకృతం కావడంతో జిల్లాలో ఆర్‌ఎంపీలు ఓ రిఫరల్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కోవిడ్ తర్వాత ఇది మరింత పెరిగి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

ఆసిఫాబాద్, మహారాష్ట్ర నుంచి..
జిల్లా నుంచే కాకుండా పొరుగునున్న ఆసిఫాబాద్, మహారాష్ట్ర, గోదావరిఖని ప్రాంతాల వారితోనూ సంబంధాలు నెరుపుతూ కమీషన్లు ఇస్తున్నారు. గతంలో ఓ ఆస్పత్రిలోని సీనియర్ వైద్యుడు యువకుల్ని పీఆర్వోలుగా నియమించుకుని మరీ ప్రచారం చేసుకున్నారు. ఇక కొందరు నేరుగా ఆర్‌ఎంపీలను గుత్తా పట్టుకున్నట్లుగా తీసుకుని ప్రజల్లో పేరున్న వారితో సంబంధాలు నెరుపుతున్నారు. చాలాసార్లు అత్యవసర వేళ రోగులకు ఏ ఆస్పత్రికి వెళ్లాలో స్పష్టత ఉండడం లేదు. దీంతో తెలిసిన వారిని, లేకపోతే స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీలనే అడిగితే పలానా ఆస్పత్రికి వెళ్లు అని చీటీ రాసిస్తే, రిఫరల్ కేసుగా జాయినింగ్ చేసుకుంటూ బిల్లుల పేరిట డబ్బులు గుంజుతున్నారు. జిల్లా పరిధిలోనే కాకుండా కరీంనగర్, హైదరాబాద్ దాకా పరిచయాలు పెంచుకుని వ్యవహారం నడిపిస్తున్నారు. ఇక ఆర్‌ఎంపీలకు కమీషన్లు ఇవ్వలేని ఆస్పత్రుల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

పర్యవేక్షణ, నియంత్రణ లేక
ప్రైవేట్ ప్రాక్టీషనర్స్, క్లినిక్‌లు, ఆస్పత్రులపై జిల్లా వైద్యశాఖ నుంచి ఎలాంటి పర్యవేక్షణ ఉండడం లేదు. అధికారులు చెబితే వినే స్థితిలో కూడా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, ఆర్‌ఎంపీలు లేకపోవడంతో అటు వైపు అధికారులు చూడడం లేదు. కొందరు కనీస అర్హత లేకున్నా సర్కారు నుంచి అనుమతులు తీసుకోకున్నా వైద్యం అందిస్తున్నారు. వీరి క్లినిక్‌లపై గతంలో తనిఖీలు నిర్వహించారు. కొందరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్నవారే సొంతంగా క్లినిక్‌లు నడుపుతూ తమ ఆస్పత్రులకు రావాలని సూచిస్తున్నారు. ఇలాంటి వాటిపై నియంత్రణ లేక ఆర్‌ఎంపీల నుంచి ఎంబీబీఎస్, ఎండీ, స్పెషలిస్టుల దాకా ఎవరి స్థాయిలో వారు వ్యవహారాలు నడుపుతున్నారు. జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీల చికిత్స, రిఫరల్‌పై పూర్తి స్థాయిలో పర్యవేక్షించి, పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'అర్హతకు మించి చికిత్స చేస్తే చర్యలు'



నెన్నెల: వైద్యం వికటించి మృతి చెందిన బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

నెన్నెల: ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం అందిస్తే చర్యలు తప్పవని నెన్నెల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సునీత ఆదేశాల మేరకు నెన్నెలలో ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్, ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని సాలేవాడలో సోమవారం ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందిన కొమ్మెర సాయిపల్లవి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగులకు ఎలాంటి యాంటిబయాటిక్ ఇంజెక్షన్లు, స్టిరాయిడ్స్ ఇవ్వవద్దని, సెలన్‌లు ఎక్కించవద్దని ఆదేశించారు. ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, అంతకుమించి చికిత్స అవసరమైతే ప్రభుత్వాస్పత్రికి పంపించాలని సూచించారు. క్లినిక్ బోర్డులపై ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమ పేరు పక్కన డాక్టర్ అని పెట్టుకోవద్దని తెలిపారు. క్లినిక్‌లోని వసతులు పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ వసుమతి, ఫార్మసిస్ట్ నారాయణ, ఏఎన్ఎం మల్లీశ్వరి, ఆశ కార్యకర్త స్వరూప ఉన్నారు.

వేమనపల్లి మండలంలో..
వేమనపల్లి: డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లా క్షయ అధికారి ఫయాజ్‌ఖాన్, వేమనపల్లి మెడికల్ ఆఫీసర్ రాజేశ్ నీల్వాయిలోని ఆర్‌ఎంపీ సంతోష్ ఇంటికి వెళ్లి విచారించారు. మృతురాలు సాయిపల్లవి ఏ సమస్యతో, ఏ సమయంలో వచ్చిందని అడిగారు. ఏ కంపెనీకి చెందిన ఇంజెక్షన్ ఇచ్చావని ప్రశ్నించారు. ఆర్‌ఎంపీ బదులిస్తూ.. రాత్రి 9 గంటలకు ఛాతిలో నొప్పితో తన వద్దకు సాయిపల్లవి రాగా ర్యాంటాక్ ఇంజెక్షన్, కొన్ని మందులిచ్చానని చెప్పాడు. ఆ తర్వాత చెన్నూర్, మంచిర్యాలలో బాలికకు వైద్యం చేయించారని, ఆమె మృతికి తాను కారణం కాదని తెలిపాడు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లి క్షయ నివారణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కాగా, ఆర్‌ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేసేందుకు జిల్లా అధికారులు వస్తున్నారనే సమాచారం మేరకు మండలంలోని ఆర్‌ఎంపీలు పరుగులు తీశారు. వైద్యబృందం వాహనాలు గమనించి క్లినిక్‌లను మూసివేసి వెళ్లిపోయారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు

భీమిని: విధులు సక్రమంగా నిర్వర్తించాలని డీపీవో వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన డంప్‌యార్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతివనం, నర్సరీ, క్రీడాప్రాంగణాల పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం భీమిని గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరుగా సేకరించి డంప్‌యార్డులకు తరలించి కంపోస్టు తయారు చేయాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలను కాపాడాలని, అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలకు ట్యాంకర్లతో నీటిని అందించాలని తెలిపారు. తెలంగాణ క్రీడాప్రాంగణంలో వసతులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగామోహన్, ఎంపీవో సబ్దర్‌అలీ, ఏపీవో భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

31లోపు ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

- నిత్యం కేంద్రాలు పరిశీలించాలి
- రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ అధికారి కృష్ణఆదిత్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణఆదిత్య

మంచిర్యాలఅగ్రికల్చర్: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ అధికారి కృష్ణఆదిత్య సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్లు బీ సంతోష్, వెంకటేశ్‌దోత్రే, మంచిర్యాల అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, కుమురంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దాసరి వేణు కలిసితో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో 15–20 టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోళ్ల వివరాలు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు నిత్యం 2–3 కేంద్రాలు సందర్శించి నివేదిక అందించాలని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించకుంటే బ్లాక్ లిస్టులో..
కొనుగోళ్ల ప్రక్రియపై దినపత్రికల్లో వచ్చిన వార్తలకు వివరణ ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలను బ్లాక్‌లిస్ట్‌లో నమోదు చేయాలని, వాటిని సీజ్ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు ఏజెన్సీల ద్వారా 286 కేంద్రాలు ఏర్పాటు చేసి 99వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. 76శాతం ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగతా వివరాలు 10 రోజుల్లో పూర్తి చేసేలా జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం తరలింపులో లారీల యజమానులు, కాంట్రాక్టర్ల సమన్వయంతో ప్రక్రియ వేగవంతంగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో, జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి హరికృష్ణ, పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, మున్సిపల్ కమిషనర్ సతీశ్‌తో కలిసి రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్ కృష్ణఆదిత్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కేంద్రం నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని రామారావుపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి హరికృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ త్వరగా పూర్తయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధి రక్షణ

- ఐటీఐ విద్యార్థులకు డ్యూయల్ ట్రెనింగ్
- మంచిర్యాల ఆర్టీసీ డిపోలో అప్రెంటీస్‌షిప్



మంచిర్యాల ఆర్టీసీ డిపోలో శిక్షణ పొందుతున్న ఐటీఐ రెండో సంవత్సరం విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటీస్‌షిప్ కోసం వివిధ పరిశ్రమల్లో చేరుతారు. ఉపాధితో పాటు నేర్చుకున్న కోర్సుల్లో నైపుణ్యం పెంపొందించుకుంటారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అప్రెంటీస్‌షిప్ పేరుతో ఏడాది పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో వీరికి స్టైఫండ్ అందజేస్తారు. ప్రస్తుతం ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌తో పాటు ఐటీఐలో సెకండియర్ చదువుతున్న విద్యార్థులకు డ్యూయల్ ట్రెనింగ్ సిస్టమ్ (డీఎస్‌టీ) అమలు చేస్తున్నారు. విద్యార్థులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రయోగాత్మకంగా ఆయా కోర్సుల్లో మూడునెలల పాటు శిక్షణ పొందుతున్నారు. మరోవైపు అన్‌జాబ్ ట్రెనింగ్ సిస్టమ్‌తో వివిధ పరిశ్రమలు విద్యార్థులకు ఆరునెలల శిక్షణతో పాటుస్టైఫండ్ చెల్లిస్తున్నాయి. మంచిర్యాల ఆర్టీసీ డిపోలో దాదాపు 80 మంది విద్యార్థులు మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో డ్యూయల్ ట్రెనింగ్ సిస్టమ్ ద్వారా శిక్షణ పొందారు.

నైపుణ్యం పెంపొందించేందుకు..
ఆర్టీసీలో చాలా రోజులుగా నియామకాలు లేవు. సిబ్బంది కొరతతో డిపోలో బస్సులు మరమ్మతు చేయటానికి కష్టాలు తప్పటం లేదు. చాలీచాలని సిబ్బందికి విధి నిర్వహణ భారమవుతోంది. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు డ్యూయల్ ట్రెనింగ్ సిస్టమ్‌లో తీసుకుని పనిచేయిస్తున్నారు. దీంతో వారిలో నైపుణ్యం పెరుగుతోంది. అప్రెంటీస్‌షిప్ పూర్తి చేసిన వారు ఎన్‌సీటీవీ జారీ చేసే ధ్రువపత్రాలు, స్టైఫండ్ పొందుతున్నారు. డ్యూయల్ ట్రెనింగ్‌తో చదువుతోపాటు కోర్సుల్లో నైపుణ్యం, శిక్షణ పొందటంతో ఉపాధికి రక్షణగా నిలుస్తుంది.

నమ్మకమేర్పడింది



శిక్షణ బాగుంది. ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యంతో బయటకు వెళ్లాక ఇతర సంస్థల్లో పనిచేస్తామనే భరోసా కలుగుతోంది. ఉపాధి దొరుకుతుందనే నమ్మకమేర్పడింది. బస్సు బ్యాటరీలు, లైటింగ్, వైరింగ్ తదితర అంశాల గురించి ఎంతో నేర్చుకున్నాను.

– అంజన్న, ఐటీఐ విద్యార్థి

ఉపాధిపై భరోసా ఉంది



ఐటీఐ చదువుతోపాటు కోర్సుల్లో ప్రయోగాత్మకంగా శిక్షణ పొందుతున్నాను. నైపుణ్యం పెరగటంతో పాటు భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. క్షేత్రస్థాయికి వెళ్లి పని చేయటం ఉపాధికి భరోసా ఏర్పడుతోంది. ఆర్టీసీ గ్యారేజ్‌లో శిక్షణ మరిచిపోలేం.

– హరికృష్ణ, ఐటీఐ విద్యార్థి

భూ'సారం' తెలిసేదెలా?

- మూడేళ్లుగా జాడ లేని పరీక్ష కేంద్రాలు
- వృథాగా మినీ భూసార పరీక్ష మిషన్లు
- పంటలసాగులో నష్టపోతున్న రైతులు



గతంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష కేంద్రం

మంచిర్యాలఅగ్రికల్చర్: మట్టి నమూనాలను పరీక్షించి ఏ సీజన్‌లో ఏ పంట వేయాలి.. ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలి.. ఎంత మోతాదులో ఎరువులు వాడితే అధిక దిగుబడులు వస్తాయి.. అనే విషయాలను రైతులకు తెలియజేయాల్సిన భూసార పరీక్ష కేంద్రాలు జిల్లాలో లేకుండా పోయాయి. గతంలో ఖరీఫ్ ముందు పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు రైతులకు తెలిపారు. గతంలో భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేసి, సరైన మోతాదులో ఎరువులు వినియోగించేవారు. మూడేళ్లుగా పరీక్ష కేంద్రంతో పాటు, రైతువేదికలకు అందజేసిన మినీ మిషన్లు కూడా నిర్వహణ లేక మూలనపడ్డాయి. దీంతో అవగాహన లేకుండా ఇష్టారీతిన పంటలు సాగు చేస్తున్న రైతులు కనీస దిగుబడులు రాక నష్టపోతున్నారు. అధిక దిగుబడి కోసం పోటీపడి ఎరువులు వేసి చివరకు నష్టాలు చవిచూస్తున్నారు. భూమిలో పోషక లోపాలు గుర్తించకుండా వేసిన పంటలే మళ్లీ మళ్లీ వేయడం, అధిక మోతాదులో ఎరువులు వేయడం లాంటి తప్పులు చేస్తున్నారు. దీంతో అధిక దిగుబడుల మాట అటుంచి.. పంటలపై చీడపీడల దాడి అధికమై సస్యరక్షణ ఖర్చు పెరుగుతోంది. భూములు నిస్సారమై భవిష్యత్‌లో సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఏర్పడుతోంది. భూసారం తెలుసుకోకుండా ఎలాంటి పంటలు సాగు చేసినా దిగుబడి రాక ఆర్థికంగా చతికిలపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మెడికల్ కళాశాల ఏర్పాటుతోనే..
గతంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో భూసార పరీక్ష కేంద్రం ఉండగా పరీక్షలు నిర్వహించారు. ఏఈవోలు ఆయా గ్రామాల నుంచి మట్టి నమూనాలు తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి రైతులకు సూచనలు చేశారు. ఖరీఫ్ ముందు జిల్లాలో 18 మండలాల్లోని రైతులు మట్టి నమూనాలను ఏఈవోలకు అందజేస్తే జిల్లా కేంద్రంలో భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా ఏయే పంటలు సాగు చేయాలి.. ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలిపేవారు. వేల సంఖ్యలో మట్టి నమూనాలు వచ్చేవి. రెండేళ్ల పాటు పరీక్షలు నిర్వహించి రైతులకు సూచనలిచ్చారు. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో దానిని తాత్కాలికంగా వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఏర్పాటు చేశారు. దీంతో అప్పటి నుంచి భూసార పరీక్షా కేంద్రం లేకుండా పోయింది. రైతులకు నేల స్వభావం తెలియకుండా పోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

ఫలితాల ఆధారంగా పంటలు
పంట మొక్కలు భూమిలో పోషకాలను ఏ మేరకు ఉపయోగించుకుంటాయన్న దానిని బట్టే దిగుబడులు ఆధారపడి ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పోషకాలు ఎక్కువైనా.. లేదా తక్కువైనా.. ఆశించిన దిగుబడులు రావు. సాధారణంగా రైతులు భాస్వరం, పొటాష్ ఎరువుల్ని సిఫారస్ చేసిన మోతాదు కంటే తక్కువ గాను, నత్రజని ఎరువును సిఫారసు చేసిన మోతాదు కంటే ఎక్కువ గాను (2.0–2.5 రెట్లు) వేస్తుంటారు. దీంతో పోషకాల సమతుల్యత దెబ్బ తింటుంది. నత్రజని ఎరువును అధికంగా వాడడంతో పంట విపరీతంగా ఎదిగి పడిపోతుంది. పూత ఆలస్యంగా వస్తుంది. తాలు ఎక్కువగా ఉంటుంది. పంట చీడపీడలకు సులభంగా లోనవుతుంది. చివరికి రైతు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ఏ పంటకు ఏ పోషకాలు తగిన పరిమాణంలో అవసరమో తెలుసుకుని, దానిని తగిన మోతాదులో అందించడాన్నే పోషక సమతుల్యత అంటారు. భూసార పరీక్షల ద్వారా మాత్రమే ఈ విషయాన్ని తెలుసుకోగలం.

తగ్గిన 'సేంద్రియ' వినియోగం
జిల్లాలో 3.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా ఇందులో ప్రధానంగా పత్తి, వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. కొన్నేళ్లుగా రైతులు పత్తి సాగు కోసం అధికంగా ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగం 80 శాతం తగ్గింది. రసాయనిక ఎరువులనే అధికంగా వినియోగిస్తున్నారు. భూమిలో పంటకు ఏ మేరకు ఎరువులు అవసరమవుతున్నాయన్న విషయంపై రైతులకు అవగాహన ఉండాలి. భూమిలో ఏయే పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలంటే భూసార పరీక్షల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. భూసార పరీక్షలు చేయించి, మోతాదులో రసాయన ఎరువులు వాడితే అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు. భూసారన్ని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. నేలల నుంచి మట్టి నమూనాల సేకరణకు ఏప్రిల్, మే నెలలు అనువైన సమయం. ఖరీఫ్, రబీ పంటలు దిగుబడికి వచ్చి ఉంటాయి కాబట్టి భూమిలో నీరు అడుగంటి ఉంటుంది. ఈ సమయంలో మట్టి సేకరించి పరీక్షలు నిర్వహిస్తే పోషక లోపాలు గుర్తించవచ్చు. కానీ.. ఇవి తెలియక రైతులు వేసిన పంటలే మళ్లీ మళ్లీ వేస్తూ, అధిక ఎరువులు వినియోగిస్తూ నష్టపోతున్నారు.

నష్టపోతున్న రైతులు

భూసార పరీక్షల్లో భాగంగా ముందుగా పొలం నుంచి మట్టి నమూనాలు సేకరించాలి. వాటిని ప్రయోగశాలకు పంపితే అక్కడ పరీక్షిస్తారు. ఆ ఫలితాల ఆధారంగా ఎరువుల మోతాదును సిఫారసు చేస్తారు. సమస్యాత్మక భూములైతే అవసరమా.. కాదా.. అనే సూచనలు చేస్తారు. భూసార పరీక్ష చేయిస్తే నేలలో సహజంగా ఉన్న ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయి తెలుస్తుంది. పంటకు ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవచ్చు. తద్వారా ఎరువులపై అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు. రెండేళ్లుగా భూసార పరీక్షలు లేక రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

పరీక్షలు నిర్వహించడం లేదు

గతంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో భూసార పరీక్ష కేంద్రం ద్వారా మట్టి నమూనా పరీక్షలు నిర్వహించాం. తాత్కాలికంగా మెడికల్ కళాశాల ఏర్పాటుతో భూసార పరీక్ష కేంద్ర భవనాన్ని తొలగించారు. తిరిగి మళ్లీ దానిని నిర్మించలేదు. మినీ భూసార పరీక్ష మిషన్లను రైతువేదికల్లో అందుబాటులోకి తెచ్చినా నీటి సౌకర్యం, ఇతర యాసిడ్స్, కెమికల్స్ సరఫరా లేక నిరుపయోగమయ్యాయి. ప్రభుత్వం అవసరమైన పరికరాలు, సదుపాయాలు కల్పిస్తే భూసార పరీక్షలు నిర్వహిస్తాం.

– సురేఖ, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

వృద్ధురాలు ఆత్మహత్య

కౌటాల: మండల కేంద్రానికి చెందిన కర్మన్‌కార్ మైనబాయి(80) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. వృద్ధురాలి ముగ్గురు కుమారులు గతంలోనే మృతి చెందారు. ఒంటరితనంతో పాటు వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 17న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నాలుగు రోజుల నుంచి మైనుబాయి బయట కనిపించక పోవడంతో స్థానికులు ఆమె మనువడు రాజ్‌కిరణ్‌కు ఫోన్లో సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు మంగళవారం ఇంటికి వచ్చి బాత్ రూంలో చూడగా ఉరేసుకుని కనిపించింది. మంగళవారం సంఘటన స్థలాన్ని ఎస్సై మధుకర్ సందర్శించారు.

మద్యానికి బానిసై ఒకరు ...

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ ఏరియాకు చెందిన జి.సుధాకర్ (28) మద్యానికి బానిసై సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కొంత కాలంగా మద్యానికి బానిస కావడంతో సుధాకర్ భార్య అతనిని వదిలి వెళ్లిపోయింది. రెండో పెళ్లి చేసుకున్నప్పటికీ మద్యం మానకపోవడంతో రెండో భార్య కూడా వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడు ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగుంట పల్లెకు చెందిన మేకల కొమురయ్య (60) జీవితంపై విరక్తితో ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య లక్ష్మి, ఎస్సై రాజశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం కొమురయ్య సోమవారం సాయంత్రం బహిర్భూమికని ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా సమీపంలోని వాగు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. పట్టణంలోని గోపాల్‌వాడలో విజయనగర్ కాలనీకి చెందిన రాపోలు ఆనంద్‌రావ్ (70) మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లి పని నిమిత్తం రాజీవ్‌నగర్ వెళ్తున్నాని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాడుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సంపత్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..


మురళీకుమార్ మృతదేహం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని భట్‌పల్లి సమీపంలో మంగళవారం లారీ ఢీకొన్న ఘటనలో మురళీ కుమార్ (54) అక్కడికక్కడే మృతి చెందినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. హనుమాన్ ట్రేడర్స్ వద్ద లారీ రివర్స్ తీస్తుండగా అక్కడే ఉన్న మురళీకుమార్‌ను లారీ ఢీ కొట్టగా తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫి ర్యాదు మేరకు లారీ డ్రైవర్ కరీంబాబాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శవాగారం.. సమస్యలకు నిలయం!

- మార్చురీ గదుల్లో అంతంత మాత్రంగా సౌకర్యాలు
- మృత దేహాలను భద్ర పర్చడానికి దిక్కులేని బాడీ ఫ్రీజర్‌లు
- పట్టింపు చేయని వైద్యశాఖ అధికారులు


బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న మార్చురీ గది

బెల్లంపల్లి: జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులు ఆధునీకరణకు నోచుకుంటున్నా పడకల సామర్థ్యం అప్‌గ్రేడ్ చేస్తున్నా మార్చురీ గదుల వైపు మాత్రం దృష్టి సారించడం లేదు. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో సౌకర్యాల కల్పనపై ఎనలేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మృతదేహాలను భద్రపరిచేందుకు అవసరమైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అనాధ, గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలతో పాటు కుటుంబ సభ్యులు, బంధుగణం కలిగిన వ్యక్తుల భౌతిక కాయాలను అనివార్యంగా అసౌకర్యాల గదిలో ఉంచాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పోస్టుమార్టం చేసేందుకు కావాల్సిన వసతులు పూర్తిస్థాయిలో లేకపోగా తగినంత సిబ్బందిని సమకూర్చడంలోనూ వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోని మార్చురీ గదుల్లో మనిషి చచ్చాక కూడా సమస్యలు వదిలిపెట్టని వైనం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు

మంచిర్యాలలో జిల్లా ప్రభుత్వాసుపత్రి, బెల్లంపల్లిలో 100 పడకల ఏరియా ఆస్పత్రి, చెన్నూర్‌లో 50 పడకల సామర్థ్యం కలిగిన ఆస్పత్రి, లక్సెట్టిపేటలో 30 పడకల ఆస్పత్రి ఉన్నాయి. వీటిని అనేక ఏళ్లక్రితం నిర్మించారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 30 పడకల సామర్థ్యం కలిగిన బెల్లంపల్లి, చెన్నూర్ ఆస్పత్రిని రెండేళ్ల క్రితం అప్ గ్రేడ్ చేశారు. కానీ అయా ఆస్పత్రుల ఆవరణలో ఉన్న మార్చురీ గదులు ఆధునీకరణకు నోచుకోవడం లేదు. అవసరమైన చోట పునర్నిర్మాణం చేయాల్సి ఉన్నా అటుగా దృష్టి సారించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

కల్పించాల్సిన సౌకర్యాలు

- మృతదేహాలకు పోస్టుమార్టం చేయడానికి, అనాధ శవాలను భద్రపర్చడానికి తగిన సదుపాయాలు కల్పించాలి.
- పీఎంఈ నిర్వహణకు విధిగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలి.
- మృతదేహాలు త్వరితగతిన కుళ్లిపోయి దుర్వాసన రాకుండా ఉండేందుకు మార్చురీ గదిలో ఏసీ సౌకర్యం కల్పించాలి.
- సరిపడా బాడీఫ్రీజర్‌లు అందుబాటులో ఉంచాలి.
- అనాధ శవాలను నిర్ణీత గడువు వరకు భద్రపరిచేందుకు, పోస్టుమార్టం చేసి మృతదేహాల నుంచి వెలికి తీసిన ఆర్గాన్స్‌ను భద్రపర్చడానికి తగిన వసతులతో స్టోరేజ్ రూం ఏర్పాటు చేయాలి.
- పీఎంఈ కేసుల నిర్వహణకు సరిపడా వార్డు బాయ్‌లను నియమించాలి.

మంచిర్యాల, బెల్లంపల్లిలో..

జిల్లాలో క్రైమ్ రేట్ అత్యధికంగా ఉంటుంది. మంచిర్యాల, శ్రీరాంపూర్, జైపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, హాజీపూర్, బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, చెన్నూర్, లక్సెట్టిపేట, తదితర ప్రాంతాల్లో బలవన్మరణాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, హత్యలు, తదితర సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటాయి. రైలు ఢీకొని, నడుస్తున్న రైలులోంచి కిందపడిపోయి, రైలు ఎక్కబోయి జారిపడి మృతి చెందుతున్న కేసులు ఏటా 100కు పైగానే నమోదవుతున్నాయి. అదనంగా అనాధ మృతదేహాలు 40 వరకు ఉంటున్నట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు చెబుతున్నారు. ఇక రోడ్డు ప్రమాదం జరిగి మృత్యువాత పడుతున్న వారి సంఖ్య 150కి పైగానే ఉంటోంది. కారణాలేమైనా క్రిమిసంహారక మందుతాగి, ఉరేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య 100కు పైగానే ఉంటోంది. అయా మృతదేహాలకు 95 శాతం వరకు మంచిర్యాల, బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రుల్లోని మార్చురీ గదుల్లో పోస్టుమార్టం నిర్వహిస్తుండగా మిగతా 5 శాతం వరకు చెన్నూర్, లక్సెట్టిపేట ఆస్పత్రుల్లో జరుగుతున్నాయి.

మార్చురీల నిర్వహణ గాలికి..

ప్రభుత్వాసుపత్రుల్లోని మార్చురీ గదుల నిర్వహణ ఏళ్ల నుంచి గాడితప్పింది. గుడ్డిలో మెల్లలా జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు ఉన్నా ఇతర ఆస్పత్రుల్లో ఆమాత్రం సదుపాయాలు కూడా లేకుండా పోయాయి. అసౌకర్యాలకు నిలయమైన బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట మార్చురీ గదులతోనే ఏళ్ల తరబడి నుంచి నెట్టుకొస్తున్నారు. మౌలిక వసతులు లేక మృతదేహాలను మార్చురీ గదిలో స్ట్రెచ్చర్‌పైనే ఉంచుతున్నారు. మృతదేహాలను భద్రపర్చేందుకు బాడీ ఫ్రీజర్ల సమస్యలున్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో మృతదేహాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నా చర్యలు తీసుకునే అధికారులు కరువయ్యారు.

నివేదిక పంపించాం

మార్చురీ గదిలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఉన్నతాధికారులకు కొన్నినెలల క్రితమే నివేదిక పంపించాం. ఇప్పటి వరకు కొత్తగా రెండు బాడీ ఫ్రీజర్ల సామగ్రి వచ్చాయి. వీటిని ఫిట్టింగ్ చేయాల్సి ఉంది. మిగతా సదుపాయాల కోసం ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.
– డాక్టర్ రవికుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, బెల్లంపల్లి

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

శ్రీరాంపూర్: ఈ నెల 24న జరగనున్న పాలిసెట్–2024కు ఏర్పాట్లు పూర్తి చేశామని మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2016 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. హాల్ టికెట్లను వెంట తీసుకొని రావాలని, హాల్ టికెట్ మీద ఫొటో ప్రింట్ కాని వారు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు వెంట తీసుకువాలన్నారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించమన్నారు. మంచిర్యాల ట్రినిటి ఇంగ్లీష్ మీడియం స్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, గర్మిళ్లలోని గవర్నమెంట్ హైస్కూల్, సాయికుంటలోని గవర్నమెంట్ హైస్కూల్, బస్టాండ్ సమీపంలోని జెడ్పీ హైస్కూల్, మార్కెట్ సమీపంలోని జెడ్పీగర్ల్స్ హైస్కూల్, సీసీసీలోని పాలిటెక్నిక్ కళాశాలలో రెండు, సింగరేణి హైస్కూల్‌లో మరో కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మద్యం షాపులో చోరీ

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో గల ఓ వైన్‌షాపులో చోరీ జరిగినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సుమారు 11:30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఓ యువకుడు మూతికి గుడ్డ కట్టుకుని షాపు పైరేకులు తొలగించి లోనికి చొరబడ్డాడు. క్యాష్ కౌంటర్లో ఉన్న రూ.98 వేల నగదు ఎత్తుకెళ్లాడు. మంగళవారం ఉదయం షాపు తెరవడంతో చోరీ జరిగిన విషయం తెలిసింది. షాపు నిర్వాహకుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కొడుకులు ఇంట్లోనుంచి గెంటేశారు..

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు


రైస్‌బ్యాగు ఇస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: నవమాసాలు మోసి కనీ పెంచిన కొడుకులు ఇంట్లో నుంచి గెంటివేశారని, తమకు న్యాయం చేయాలని ఓ తల్లి పోలీసులను ఆశ్రయించిన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక చింతపండువాడకు చెందిన సామంతుల గోపమ్మ(78)కు ఐదుగురు కుమారులు, కుమార్తె సంతానం. వృద్ధురాలి భర్త కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా ఉన్న ఆస్తిని కుమారులందరికీ సమానంగా పంచి ఇచ్చింది. అయినా తన సంరక్షణ చూసుకోకపోవడమే కాకుండా ఇంట్లో నుంచి వెళ్లగొట్టడంతో నేరుగా పోలీసులను ఆశ్రయించింది. స్పందించిన సీఐ బన్సీలాల్ వృద్ధురాలి కుమారులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. సరిగా చూసుకోవాలని హెచ్చరించి గోపమ్మను తన కుమారులకు అప్పగించారు. అనంతరం సీఐ గోపమ్మకు 25 కిలోల రైస్‌బ్యాగును అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

కందకం తవ్వకాలను అడ్డుకున్న రైతులు


అంకుసాపూర్‌లో పనులు అడ్డుకుంటున్న రైతులు

భీమారం: మండలంలోని అంకుసాపూర్ శివారు సర్వేనంబర్ 140లో అటవీశాఖ అధికారులు మంగళవారం జేసీబీతో కందకం తవ్వే పనులు చేపట్టగా రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా అటవీశాఖ అధికారులు వచ్చి దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. గతంలో నిర్మించిన చెరువు కింద 40 ఎకరాలు సాగు చేసుకుంటున్నామని, చెరువును కూడా పూడ్చివేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రైతులు పనులు అడ్డుకోవడంతో అధికారులు వెనక్కి వెళ్లిపోయారు.

పాత బెల్లంపల్లిలో కేంద్ర బృందం పర్యటన


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న సభ్యులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామంలో కేంద్ర అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. కేంద్ర సెక్రటేరియట్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులుగా(ఏఎస్‌వో) ప్రొబేషనరీ విధులు నిర్వర్తిస్తున్న పలువురు అధికారులు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో ముచ్చటించారు. క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, స్మశాన వాటిక, నర్సరీ, ప్రభుత్వ పాఠశాల, అవెన్యూ ప్లాంటేషన్, డంపింగ్ యార్డు పరిశీలించారు. డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువు తయారీ విధానంపై స్థానిక అధికారులు అవగాహన కల్పించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో అధికారులు అంకేష్ కుమార్, యోగేష్ యాదవ్, ఆశీష్ శుక్లా, లోకేష్ దివానా, అమన్ గోస్వామి, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో ఎస్తర్ డేవీడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

'కిరీటి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి'


వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జైపూర్: జైపూర్ పవర్ ప్లాంటులో డీవైఎస్సీగా విధులు నిర్వర్తించిన కిరీటి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. మృతిపై సమగ్రంగా విచారణ జరిపించి బాధ్యులపై సంస్థ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి సంస్థ అండగా నిలబడి అన్నివిధాలుగా న్యాయం చేయాలని ఏఐటీయూసీ ఎస్టీపీపీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ కోరారు.

చోరీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాతనపల్లి క్రాస్‌రోడ్ వద్ద ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డ ఉత్తరప్రదేశ్‌కు చెందిన నదీమ్‌ను మంగళవారం అ రెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంచిర్యాలలో నివాసముంటున్న నదీమ్ జల్సాలకు అలవాటుపడి కొంతకాలంగా దొంగతనాలు చేస్తున్నాడన్నారు. ఆదివారం రాత్రి క్యాతనపల్లిలోని హనుమాన్ టెంపుల్ ఎదురుగా గల ఇంట్లో చోరీ చేసి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడన్నారు. మంగళవారం గద్దెరాగిడి ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ విషయం బయటకు వచ్చిందన్నారు. ఈ మేరకు నిందితుడి నుండి ముప్పావు తులం బంగారం, 24 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

150 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో పోలీసులు

మందమర్రిరూరల్: జగిత్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 150 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేస్తుండగా ఐచర్ వాహనంలో 150 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయని తెలిపారు. బియ్యం తరలిస్తున్న మహమద్ అలీని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నస్పూర్: ఈ నెల 19న గోవాలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో నస్పూర్‌కు చెందిన విద్యార్థి ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. నస్పూర్ గేటు వద్ద నివాసం ఉండే ముదమల సాయి బ్రహ్మేశ్వర్ అండర్–16 విభాగంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని కుమిటి, కటా ఈవెంట్‌లలో ద్వితీయస్థానంలో నిలిచి సిల్వర్ పతకాలు సాధించాడు.

డెప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే వినోద్


డెప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించేందుకు చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పశువైద్యశాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి పశువైద్యశాలను మంగళవారం జిల్లా పశువైద్య అండ్ పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్ తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందువల్ల పశువులకు గుండెవాపు, జబ్బవాపు, గొర్రెలకు చిటుకు రోగం వస్తుందని, టీకాలు వేయాల్సిందిగా ఆదేశించారు. నూతన భవనం మంజూరుకు ప్రయత్నాలు చేస్తూనే ఇతర భవనాల్లో తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేసుకుని సేవలు అందించాలని, రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా సామగ్రి పట్టివేత


పట్టుకున్న సామగ్రితో ఆబ్కారీ సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి గుడుంబా తయారీ సరుకుల రవాణా వాహనాన్ని అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం సీఐ గురువయ్య తెలిపిన వివరాల మేరకు లక్సెట్టిపేట వైపు నుంచి మంచిర్యాల వైపు వస్తున్న వాహనంలో నాందేడ్ నుంచి గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం, పటిక వస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 450 కిలోల బెల్లం, 10 కిలోల పటిక లభించినట్లు తెలిపారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మంచిర్యాలకు చెందిన వైద్య వేణుగా గుర్తించారు. కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

'సింగరేణి ఆస్పత్రి మూసివేతకు కుట్ర'


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని మూసివేసేందుకు జీఎం రవిప్రసాద్ కుట్రపన్నుతున్నారని ఏఐటీయూసీ బెల్లంపల్లి, గోలేటి బ్రాంచ్‌ల ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఏరియా ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సులు, వార్డుబాయ్‌ల పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. 250 పడకలు కలిగిన ఆస్పత్రిని 75 పడకలకు కుదించారన్నారు. స్పెషలిస్టు వైద్యులను రప్పించడంలో శ్రద్ధచూపడం లేదన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చి కార్మికులకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఏరియా జీఎం నియంత విధానాలను విడనాడి కార్మికుల శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. సమావేశంలో నాయకులు దాసరి శ్రీధర్, దాసరి తిరుపతిగౌడ్, పుట్ట శ్రీనివాస్, రత్నం ఐలయ్య, మంతెన రమేశ్, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట–2 గనిపై మ్యాన్‌రైడింగ్ తనిఖీ


మ్యాన్‌రైడింగ్‌ను పరిశీలిస్తున్న సేఫ్టీ జీఎం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై నూతనంగా ఏర్పాటు చేసిన మ్యాన్‌రైడింగ్ సిస్టమ్‌ను మంగళవారం సేఫ్టీ జనరల్ మేనేజర్ (కార్పొరేట్) గురువయ్య, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రవికుమార్, జీఎం ఈఅండ్‌ఎం రామానందంతో కలిసి తనిఖీ చేశారు. చైర్‌లిఫ్ట్ మ్యాన్‌రైడింగ్ ఆపరేటింగ్‌లో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ప్రతి ఒక్కరు మ్యాన్‌రైడింగ్‌ను సద్వినియోగం చేసుకొని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్, గని అధికారులు పాల్గొన్నారు.

'బోగస్ పేర్లు తొలగించాలి'


వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ కులస్తులు

చెన్నూర్: పట్టణంలోని పెద్ద చెరువు సొసైటీలో గల బోగస్ పేర్లను తొలగించి అర్హులైన ముదిరాజ్ కులస్తులకు అవకాశం కల్పించాలని కోరుతూ మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీలో సుమారు పదివేల మంది ముదిరాజ్ కులస్తులు ఉన్నారన్నారు. గతంలో పెద్ద చెరువులో ముదిరాజ్‌లకు, గంగపుత్రులకు జాయింట్ సొసైటీ ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సొసైటీ ఏర్పాటు చేసుకుని ముదిరాజ్‌లకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

జైనథ్: మండలంలోని భోరజ్ సమీపంలో సోమవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు వెనుకనుంచి ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిరాల గ్రామానికి చెందిన భోయర్ జగదీష్ పక్కింట్లోని ఛాయాబాయి, లక్ష్మణ్ దంపతుల కుమారుడు పవార్ కృష్ణ (11)తో కలిసి కారులో ఆదిలాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా భోరజ్–బేల జాతీయ రహదారిపై ఎరువుల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనక నుంచి ఢీకొన్నాడు. కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఘటనలో జగదీష్, కృష్ణకు తీవ్రగాయాలు కావడంతో 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మంగళవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జగదీశ్ పరిస్థితి సైతం ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు మృతుని తల్లి ఛాయాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

దాడిచేసిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన శ్రీకాంత్, అరుణ్, సతీష్‌పై దాడి చేసిన రవితేజ, చెప్పు అనే వ్యక్తులపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న క్రాంతినగర్ రోడ్డుపై అడ్డంగా రవితేజ, చెప్పు అనే ఇద్దరు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఆ రోడ్డు గుండా వెళ్తున్న శ్రీకాంత్, అరుణ్ వాహనం వారికి తాకగా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. వీరితో పాటు మరో వ్యక్తి సతీష్‌పై కూడా దాడికి దిగారు. శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.